www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భీద్రాద్రి
ఆదివారం | 25 | అక్టోబర్ | 2026
పేజీలు : 8

నాణ్యతతో పనులు చేపట్టాలి



-విద్యుత్‌ను అక్రమంగా వినియోగించవద్దు
-అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన

2లో..

ఎల్‌నినోతో ప్రమాద ఘంటికలు

-విద్యుత్, నీరు పొదుపు చేయాల్సిందే
-ఇది కాలం తెచ్చిన కరువు
-మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క
-విపత్తును ఎదుర్కొనేందుకు సకల చర్యలు



ప్రజాపక్షం/ఖమ్మం : ఎల్‌నినోతో రానున్న ఎనిమిది మాసాల కాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనున్నామని ఇందుకు ప్రజలు సంసిద్ధులై ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉందని ఇప్పటికే అనేక దేశాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ఉన్నాయని తెలంగాణ రాష్ట్రం కూడా ఇప్పటికే ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. శనివారం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు చోట్ల రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా కోదుమూరు గ్రామంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు భూ గర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. రానున్న ఏడెనిమిది మాసాలు వర్షాలు కురిసే అవకాశం లేదని ఉన్న నీటిని పొదుపుగా మిగతా 2లో..

ఆక్రమణలు ఆగేదెన్నడో?

-98 నెం. సర్వే రేకుల షెడ్డు నిర్మాణ పనులు
-అధికారుల ఆదేశాలు బేఖాతర్



2లో..



ఎల్‌నినోతో ప్రమాద ఘంటికలు

(మొదటిపేజీ తరువాయి)

నీరు మాత్రమే ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 44,340 చెరువులు, కుంటలు ఉంటే వాటి ద్వారా 470 టిఎంసిల నీరు లభ్యమయ్యేదని కానీ ఇప్పుడు దాదాపు మూడొంతుల చెరువుల్లో 20 శాతాని కంటే నీరు తక్కువగా ఉందని విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో 30 లక్షల పంపు సెట్లు ఉంటే అందులో సగం పంపుసెట్లకు అంటే 15 లక్షల పంపుసెట్లు భూగర్భ జలం ఇంకిపోయి పనిచేయడం లేదన్నారు. ఇటువంటి విపత్తును రాజకీయ అవసరాలకు వాడుకోకుండా కరోనాలో అన్ని పార్టీలు సహకరించినట్లు ఈ విపత్తును ఎదుర్కొనేందుకు సహకరించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విజ్ఞానపరులైన ఆలోచన కలిగిన నాయకులు ముందు చూపుతో వ్యవహరించాలన్నారు. బాధ్యతగా వ్యవహరించక పోతే ఈ సమాజానికి నష్టం చేసినట్లేనని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చర్యలు తీసుకుంటున్నామని దీనికి మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. కరోనా విపత్తును నేను అసెంబ్లీలో ముందే హెచ్చరిస్తే అనాటి ప్రభుత్వం పట్టించుకోలేదని కానీ చివరకు పట్టించుకోక తప్పలేదని ఈ సందర్భంగా భట్టి గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆహార పదార్థాల కొరత లేదని మరో ఏడాది వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆహార ధాన్యాలను అందిస్తామని ఆయన తెలిపారు. తాగునీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రజల తాగునీటితో పాటు పశు పక్షాదులను కూడా రక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని విక్రమార్క గుర్తు చేశారు. విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో ఉందని ఈ అక్టోబర్ మాసంలో 20018 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతుందన్నారు. 2014లో విద్యుత్ వినియోగం 6648 మెగావాట్లు ఉందని ఆయన తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీకి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగిందని ఇంకా కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. విద్యుత్ డిమాండ్ గతంలో ఆరు నుంచి ఆరున్నర శాతం పెరిగేదని కానీ ఈ ఏడాది 25 శాతం డిమాండ్ పెరిగిందన్నారు. 2026లో 335.05 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం జరుగుతుందని గతేడాదితో పోల్చినప్పుడు ఇది 37 శాతం ఎక్కువ అని విక్రమార్క తెలిపారు. ట్రాన్స్‌కో పరిధిలో 11 సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని డిస్కమ్‌ల పరిధిలో 177 సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని ఇంకో 267 సబ్ స్టేషన్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా గ్రామీణ ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సకల చర్యలు చేపట్టామని ఉపాధి కొరకు వివి జీ రాం జీ పథకం ద్వారా పలు పనులు చేపడుతున్నామన్నారు. గతంలో యుపిఏ ప్రభుత్వం రూపొందించిన ఈజిఎస్ పనుల్లో కేంద్రం భరించేదని కానీ ఇప్పుడు 40 శాతం రాష్ట్రాలపై భారం మోపిందని అయినా రాష్ట్రం వెనుకాడకుండా పనులు చేపడుతుందన్నారు. ఇప్పటికే 9.1 లక్ష పనులను గుర్తించామని దానికి అదనంగా మరో ఎనిమిది లక్షల పనులు చేపడతామని ఇందులో భాగంగా వివి జీ రాంజీ ద్వారా వ్యవసాయ కుంటలు, ఇంకుడు గుంటలు, సోక్ పీట్లు, భూగర్భ జలాలు రీ చార్జ్ పనులు, పశువులు, కోళ్లు, మేకల షెడ్ల నిర్మాణానికి, గ్రామీణ ప్రాంతాల్లో మెటల్, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఎల్‌నినోను రాజకీయ అవసరాలకు వాడుకోకుండా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అండగా నిలవాల్సిన సమయంలో అనవసర విషయాలు ప్రచారం చేయవద్దని ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు కాదని కాలం తెచ్చిన కరువు అన్నారు. 100 దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉందని 100 దేశాలను కాంగ్రెస్సే పాలిస్తుందా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉందని విక్రమార్క స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ట్రాన్స్‌కో సిఎండి వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ శాసన సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :



నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుడా నిధులు రూ. 1.30కోట్లతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి రెండు మూడు వారాలకు ఒక సారి పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దన్నారు. ఎవరు అక్రమంగా విద్యుత్‌ను వినియోగించకూడదన్నారు. వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం కొత్త విద్యుత్ మీటర్లు అందించేందుకు విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ మీటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఇంటి పన్ను ధృవీకరణ పత్రాలు కూడా అందించాలన్నారు. కాలనీలో నివసించే వారు నిబంధనల ప్రకారం విద్యుత్ సేవలను వినియోగించుకోవాలన్నారు. 2023లో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇండ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మాజీ కార్పొరేటర్లు లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పల్లెబోయిన చంద్రం, శ్రావణ్, నాయకులు పాల్గొన్నారు

నీటి సమస్యను పరిష్కరించాలి

-సింగరేణి జీఎంకు సర్పంచ్ రమేష్ బాబు వినతి

ప్రజాపక్షం/ఇల్లందు:



విజయలక్ష్మీ నగర్ గ్రామ పంచాయితీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు సింగరేణి ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి సరఫరా చేస్తున్న తాగునీరు పాత పైపులైన్లు తుప్పు పట్టి దెబ్బ తినడంతో గత పది నెలలుగా కాలువల్లో వృథాగా పోతోందని తెలిపారు. సింగరేణి సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఈ ప్రాంతానికి తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ, సుమారు 40ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అధికారులు సమస్యను పరిశీలించినా ఇప్పటి వరకు పరిష్కారం లభించలేదన్నారు. గ్రామ పంచాయితీలో ప్రత్యామ్నాయంగా బోర్ల ద్వారా నీరు అందించే అవకాశం కూడా లేదని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి మరింత పెరిగే అవకాశం ఉన్నందున, పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి తాగునీటి వృథాను అరికట్టడంతో పాటు గ్రామ ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించాలని సర్పంచ్ రమేష్ బాబు జీఎంను కోరారు.

రైతుబిడ్డ చల్లగుళ్లకు ఏఎంసీ చైర్మన్ పదవి

-సత్తుపల్లిలో హర్షాతిరేకాలు..
-రైతులకు మేలు జరుగుతుందని ఆశాభావం

ప్రజాపక్షం/సత్తుపల్లిః సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు కలిగిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రైతుబిడ్డ చల్లగుళ్ల నరసింహారావును సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవి వరించనుంది. ఆయనకు పదవి ఖరారైనట్లు సమాచారం వెలువడటంతో రైతులు, ప్రజలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆత్మీయుడిగా, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ దంపతులకు చేదోడు వాదోడుగా ఉంటూ చల్లగుళ్ల తనదైన ముద్ర వేసుకున్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తూ, పదవులను ఆశించకుండా అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించే నాయకుడిగా గుర్తింపు పొందారు. వ్యవసాయంపై ప్రత్యక్ష అవగాహన కలిగిన చల్లగుళ్లకు మార్కెట్ కమిటీ బాధ్యతలు అప్పగించడంతో రైతులకు మరింత మేలు జరుగుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే దంపతుల విజ్ఞప్తి మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆయన పేరును ఆమోదించినట్లు సమాచారం. మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుల ప్రకటన, అధికారిక బాధ్యతల స్వీకార కార్యక్రమంపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ కమిటీ అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ చల్లగుళ్ల నరసింహారావు ముందుకు సాగాలని రైతులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.





ఆక్రమణలు ఆగేదెన్నడో?

ప్రజాపక్షం/వైరాः వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు, 98 సర్వే నెంబర్‌లోని గుట్ట ప్రాంతంలో ఆక్రమణల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. వాటర్ ట్యాంక్ సమీపంలో గతంలో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టగా అధికారులు మందలించినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే కొంతకాలం తర్వాత మళ్లీ రేకుల షెడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని, చుట్టుప్రక్కల చెట్లను తొలగించి గోడలు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. 98 సర్వే నెంబర్‌లోని భూములకు సంబంధించి ప్రభుత్వం నిషేధిత భూముల గుర్తింపు చేపట్టినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపద్యంలో సదరు ప్రాంతంలో నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నారు. ఇప్పటికే గ్టుట పరిసరాల్లోని పలు ప్రాంతాలు ఆక్రమణలకు గురైనట్లు సంబంధిత అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ విషయమై రిజిస్ట్రేషన్ శాఖకు కూడా సమాచారం అందించినట్లు తెలుస్తుంది. గతంలో అధికారులు మందలించినప్పటికీ మళ్లీ నిర్మాణ పనులు ఎలా కొనసాగుతున్నాయనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. రేకుల షెడ్డు వెనుక ఎవరెవరి పాత్ర ఉంది? అధికారుల ఆదేశాల తర్వాత కూడా పనులు చేపట్టడానికి కారణాలేమిటి? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. గుట్ట చుట్టూ వివిధ ప్రాంతాల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి, భూముల హద్దులను నిర్ధారించాలని కోరుతున్నారు. వైరా మున్సిపాలిటీ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి 98 సర్వే నెంబర్‌లోని భూముల స్థితిగతులను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



ఖమ్మం జిజిహెచ్‌లో వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి



-వైద్యుల హాజరు నుంచి అభివృద్ధి పనుల వరకు..
అదనపు కలెక్టర్ సమీక్ష

ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగంః ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మెరుగుపరిచి, రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిజిహెచ్)లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వైద్య సేవల నిర్వహణ, మౌళిక సదుపాయాల కల్పనపై శనివారం అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు సహా పలువురు వైద్యాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆసుపత్రిలో వైద్యుల హాజరు, విధుల నిర్వహణ, అవసరమైన వైద్య పరికరాలు కొనుగోలు, రోగుల తరలింపుకు స్ట్రెచర్ల సమకూర్పు, భవన నిర్మాణ పనులు, ఖాళీ పోస్టుల భర్తీ, వివిధ విభాగాల తరలింపు వంటి కీలక అంశాలపై అధికారులు చర్చించారు. అక్టోబర్ 1 నుంచి 20వ తేదీ వరకు వైద్యుల విధులకు హాజరైన సమయాలు, విధులు ముగించుకుని వెళ్లిన సమయాలకు సంబంధించిన వివరాలను సమర్పించాలని సూచించారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రుల్లో అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించారు. తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, ఖమ్మం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు సేకరించారు. అదేవిధంగా ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ, ఆసుపత్రిలోని వివిధ విభాగాల తరలింపు స్థితిగతులపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణ పనులు, పరికరాల కొనుగోలు, నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలు సమగ్రంగా సమర్పించి, ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలను సమన్వయంతో చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను పెంచడం, మౌళిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే సమీక్ష సమావేశం ప్రధాన ఉద్దేశమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. ఈ సమావేశంలో జిజిహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, ఇన్‌చార్జి మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుమాధవ రావు, ఏఓ మమత, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చెట్ల పెంపకం అవసరం

వైరా 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత



ప్రజాపక్షం/వైరాఃు పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు పచ్చని చెట్ల పెంపకం ఎంతో అవసరమని వైరా మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత అన్నారు. శనివారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగం గా 12వ వార్డులో మొక్కల పంపిణీ కార్యక్రమా న్ని కౌన్సిలర్ మాదినేని సునీత ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో కలిసి వార్డులోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. భావితరాల భవిష్యత్తు కోసం మొక్కల పెంపకం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. చెట్లు స్వచ్ఛమైన గాలిని అందించడంతో ఆపటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి అది పెరిగి పెద్దదయ్యే వరకు బా ధ్యతగా సంరక్షించాలని ఆమె ఆమె పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని భావితరాలకు అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ అధికారులు వెంకట్రావు, శ్రీను, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ రీ సర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి



సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

ప్రజాపక్షం/పెనుబల్లిఃు రీ సర్వేలో తప్పులకు తావులేకుండా పారదర్శకంగా భూ వివరాల నమోదు దిశగా, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం పెనుబల్లి మండలం తాళ్లపెంట గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సర్వే పనుల పురోగ తిని సమీక్షించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డుల్లోని వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి, ఎలాంటి పొర పాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రి యలో పారదర్శకత పాటించాలని, రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలపై అభ్యంతరాలు లేదా సందేహాలు వ్యక్తమైతే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే బృందాలు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయా లని ఆదేశించారు. సంబంధిత అధికారులు రీసర్వే పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రోజువారీ పురోగతిని సమీక్షించాలని, పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పెనుబల్లి తహశీల్దార్ వీరభద్రనాయక్, ఆర్ఐ సక్కు, తాళ్లపెంట, బ్రహ్మాళకుంట, గంగదేవిపాడు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం





ప్రజాపక్షం/వైరాఃు నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు శాంతినగర్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని వార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిసిసి హెల్త్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, సీనియర్ నాయకులు పొదిల్ల హరినాథ్, వైరా టౌన్ ప్రెసిడెంట్ వీరంశెట్టి సీతారాములు, డిసిసి అధికార ప్రతినిధి పమ్మి అశోక్, మాజీ టౌన్ ప్రెసిడెంట్ ఏదునూరి సీతారాములు, మాజీ కౌన్సిలర్ లక్ష్మీబాయ్, కర్నాటి హనుమంతరావు, కొల్లి రమేష్, భరత్, వార్డు కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల రాము, బిక్యా, పండు, తేజావత్ నాగేశ్వరరావు, హుస్సేన్, పృథ్వి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

డిఎల్ఎస్ఏ మెగా డ్రైవ్ విజయవంతం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గిరిజన కుటుంబాలకు న్యాయ సేవలు చేరువ చేసేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) చేపట్టిన 60 రోజుల మెగాడ్రైవ్ విజయవంతంగా ముగిసింది. నాల్సా మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి డిఎల్ఎస్ఏ చైర్మన్ ఎం. నాగరాజు ఆధ్వర్యంలో డిఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవిమానస పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన జనాభా అధికంగా ఉన్న సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామాన్ని ప్రత్యేకంగా ఎంపిక చేసుకుని క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించారు. 20 మంది పారాలీగల్ వాలంటీర్లు, డిఎల్ఎస్ఏ సిబ్బంది సమన్వయంతో గ్రామస్తులకు అధికారిక ప్రక్రియలపై అవగాహన కల్పించి దరఖాస్తులు చేయించారు. న్యాయం అంటే కేవలం కోర్టు కేసుల పరిష్కారమే కాదని అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక భద్రతను అందించడం కూడా అందులో భాగమేనని డిఎల్ఎస్ఏ నిరూపించింది. ఈ మెగాడ్రైవ్‌లో 122 మందికి కార్మిక కార్డులను నమోదు చేయించారు. తొమ్మిది కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. 37 మందికి ఆధార్ సవరణలు చేపట్టారు. ఇద్దరు దివ్యాంగులకు స్వచ్ఛంద సంస్థ సహకారంతో వీల్ చైర్‌లతో పాటు ఒక రికి జైపూర్ ఫుట్ (కృత్రిమ కాలు) అందించారు. నలుగురు లబ్ధిదారులకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించారు. అక్టోబర్ 17న జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి సూర్యపల్లి నంద చేతుల మీదుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందజేశారు. చట్టపరమైన రక్షణలు, సంక్షేమ ఫలాలను అణగారిన వర్గాల గడపవద్దకు చేర్చడంలో డిఎల్ఎస్ఏ ఖమ్మం యంత్రాంగానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచిందని పలువురు ప్రశంసించారు. 60 రోజుల పాటు నిర్వహించిన ఈ డ్రైవ్ అక్టోబర్ 23న ముగిసినట్లు డిఎల్ఎస్ఏ బాధ్యులు తెలిపారు.

మెప్మా వేతనాలు చెల్లించకపోతే ఆందోళన తప్పదు : ఎఐటియుసి



ప్రజాపక్షం/కల్లూరుఃు మెప్మా రిసోర్స్ పర్సన్ లకు గత మూడు నెలలుగా వేతనాలు అందక అష్ట కష్టాలు పడుతున్నామని ప్రభుత్వం చెల్లించినా కూడా ఖాతాలలో జమ కానందున మెప్మా ఆర్పీల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహిస్తామని మున్సిపాలిటీ కమిషనర్ కు తెలియపరిచారు. జిల్లా అధికారులు చెక్కు తప్పుడు అక్షరాలతో రాయడం వలన వేతనాలు జమ కాలేదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దండు ఆదినారాయణ, మహిళా సంఘం నాయకురాలు బేగం కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన కమిషనర్ వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందించి వేతనాలు ఖాతాలలో జమ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లేనిచో సోమవారం ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం



ప్రజాపక్షం/ఎర్రుపాలెంఃు జమలాపురం గ్రామం లో శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బా కృష్ణ ప్రసాద్, ఎల్వి నారాయణరెడ్డి తెలిపాడు. శనివారం జమలాపురం గ్రామానికి చెందిన లక్కిరెడ్డి శివకుమార్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా తల్లిదండ్రులు ఎల్వి నారాయణరెడ్డి, సరోజిని దంపతులు, గుంటూరు జిల్లా యర్రబాలెం గ్రామానికి చిలుకూరి వెంకట దశరదీల వితరణలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతిరోజూ అన్నం గోవిందం దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానం చేయటం వల్ల ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు వారిపై ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి గౌరవాధ్యక్షురాలు కొడాలి విజయలక్ష్మీ దేవి, ఉపాధ్యక్షురాలు గిరిజాలక్ష్మీ, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, సహాయ కార్యదర్శి చింతా కిషోర్, కోశాధికారి వీరమాచినేని వెంకటకృష్ణ, కాకుమాను లీలాకృష్ణ, అల్లూరి విష్ణుమూర్తి, చొప్పవరపు శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వరునికి ఘనంగా సర్వాంగాభిషేకం



ప్రజాపక్షం/ ఎర్రుపాలెంఃు తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం నందు స్వామి వారికి, అమ్మవార్లకు శనివారం పంచామృతాలతో సర్వాంభిషేకం ప్రధాన అర్చకులు ఉప్ప శ్రీనివాసశర్మ ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాల అలంకార రూపంలో స్వామి వారు అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం కావటంతో వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ నిర్వాహకులు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, కృష్ణప్రసాద్, ముఖ్య అర్చకులు, వేదపండితులు, అధికసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి..

గుడి ముందే బెల్టు షాపులు

-మంచినీళ్ళకైనా కొదవుంటుందేమే కానీ?
-మద్యం మాత్రం ఎక్కడంటే అక్కడే
-ఘర్షణలకు అడ్డాగా మారిన బెల్టు షాపులు
-చోద్యం చూస్తున్న సంబంధిత అధికార యంత్రాంగం



ప్రజాపక్షం/జూలూరుపాడుః అధికారానికి ధనదాహం తోడై వ్యవస్థలను గుప్పిట పట్టి విచ్చలవిడిగా చెలరేగిపోతుంటే అడుగడుగునా బెల్ట్ షాపులు కనిపిస్తాయి. మంచి నీళ్లకైనా కొదవుంటుందేమో కానీ మద్యం మాత్రం ఎక్కడంటే అక్కడ దొరుకుతుంది. నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతూనే ఉంటుంది. బడి పక్కన, గుడి ఎదుట బెల్టు షాపులు యదేచ్ఛగా నడుస్తూనే ఉంటాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారి పక్కనే బెల్టు షాపులు నడుస్తున్నా అధికారులకు మాత్రం కనిపించదు. ప్రజల ప్రాణాలు పోతున్నా అక్రమ దందా మీద మాత్రం అధికారులు ఈగ వాలనివ్వరు. ఇదీ జూలూరుపాడు మండలంలోని పరిస్థితి. జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట, అక్షరాలు నేర్పించే అక్షర దేవాలయం అది. రేపటి పౌరులను తీర్చిదిద్దాల్సిన ఆవరణ అది. కానీ, అక్కడ చదువుల తల్లి పాఠాల కంటే ముందే మద్యపాన వ్యసనం దర్శనమిస్తోంది. గుడి, బడి పరిసరాల్లో మద్యం దుకాణాలు ఉండకూడదనే ప్రభుత్వ నిబంధనలు ఇక్కడ పూర్తిగా తుంగలో తొక్కేశారు. జూలూరుపాడు మండలకేంద్రంలో సాయిబాబా ఆలయం, సెయింట్ యాంటోని పాఠశాల, సాధన జూనియర్ కాలేజీ పరిసరాల్లో వెలిసిన బెల్టు షాపుల వలన చదువుకునే వాతావరణం, భక్తులు ఇబ్బంది పడటమే కాకుండా, చిన్నారి మనస్సులపై ఈ దృశ్యాలు తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుడి ముందే రాత్రింబవళ్లు యదేచ్ఛగా మద్యం అమ్మకాలు..

నిబంధనల ప్రకారం పాఠశాలలు, దేవుని గుడులకు నిర్ణీత దూరంలో మద్యం విక్రయాలు జరగకూడదు. కానీ, జూలూరుపాడు మండల కేంద్రం ప్రధాన రహదారి, నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి సాయిబాబా ఆలయానికి భక్తులు వెళ్లే ప్రధాన రహదారి వెంట కళ్లముందే నిత్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నా సంబంధిత ఎక్సైజ్, పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వీడి, జూలూరుపాడు ప్రధాన రహదారి వెంట గుడి, పక్కన ఉన్న బెల్టు షాపులను తక్షణమే తొలగించి, అర్ధ రాత్రుల్లో మద్యం సేవించి న్యూసెన్స్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

గొడవలకు అడ్డాగా బెల్ట్ షాపులు..

గత వారం రోజుల క్రితం కొంతమంది యువకులు మద్యం మత్తులో సాయిబాబా ఆలయం వద్ద బెల్టు షాపు నందు రోడ్డుపై వీరంగం సృష్టించారు. బెల్టుషాపు వద్ద జరిగిన ఈ ఘర్షణలో యువకులు గట్టిగానే కొట్టుకున్నట్లు వినికిడి. మండల కేంద్రం, ప్రధాన రహదారి రాత్రింబవళ్ళు బెల్టు షాపుల వద్ద మద్యం అమ్మకాల వలన గొడవలు మామూలుగా మారాయి. దీంతో బెల్టు షాపులు గొడవలకు అడ్డాగా మారాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మద్యం షాపులను గ్రామానికి దూరంగా నిర్జన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని నిబంధన విదించింది. అమలులో దీనిని బాగానే అమలు చేస్తున్న మద్యం దుకాణాల యజమానులు బెల్టుషాపులను మాత్రం ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేయించి అధిక ధరకు మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరుగా నమోదు కావాలి

-ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగులకు మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత పిలుపు





ప్రజాపక్షం/బూర్గంపాడు: పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని బూర్గంపాడు మండల మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ద్వారా పట్టభద్రులు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేందుకు సిద్ధం కావాలని, అర్హత ఉన్న ఒక్కరూ నమోదు కాకుండా మిగిలిపోకూడదని ఆమె కోరారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో భాగంగా మోరంపల్లిబంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగులను కామిరెడ్డి శ్రీలత, ఇతర నాయకులు కలిసి ఓటరు నమోదు ఆవశ్యకతను వివరించారు. ఈసందర్భంగా శ్రీలత మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమన్నారు.

సమిష్టి కృషితోనే విస్తత అవగాహన...

పట్టభద్రుల ఓటరు నమోదుపై గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని శ్రీలత అన్నారు. ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ పరిచయ వర్గాల్లోని అర్హులైన పట్టభద్రులకు సమాచారం అందించి నమోదు ప్రక్రియలో సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల భాగస్వామ్యం పెరగాలంటే ఓటరు నమోదుపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ పొక్కుల రవి, మాజీ వార్డు సభ్యురాలు కామిరెడ్డి పద్మ, మండల బీసీ సెల్ అధ్యక్షుడు చేతుల పెద్ద వీర్రాజు, మూల బాలిరెడ్డి, కోరుకుంట్ల చిన్నపరెడ్డి, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాడర్ ఉన్న నాయకులకు గుర్తింపు ఏది..?

-బీఆర్ఎస్‌లో క్షేత్రస్థాయి నాయకుల అసంతృప్తి!

ప్రజాపక్షం/కారేపల్లి: పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతూ, ప్రజల్లో ఉంటూ, కార్యకర్తలను సమన్వయం చేస్తూ బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేసిన నాయకులకు తగిన గుర్తింపు లభించడం లేదనే అసంతృప్తి పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్నప్పుడూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ పార్టీ జెండాను మోస్తూ ప్రజా సమస్యలపై పోరాడిన క్షేత్రస్థాయి నాయకులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కార్యకర్తల కష్టానికి గుర్తింపు ఎక్కడ?

పార్టీ కోసం నిరంతరం పని చేసే నాయకులను పక్కనపెట్టి ఇతరులకు ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన కార్యకర్తల్లో అసంతృప్తికి కారణమవుతోందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నాయకులను గుర్తించి, వారికి తగిన బాధ్యతలు అప్పగిస్తే క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

నాయకత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలి

కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం కార్యకర్తలతో సంబంధాలు కొనసాగించాలని, ప్రజల్లో పట్టున్న నాయకులకు, నిబద్ధతతో పని చేసే క్యాడర్‌కు గుర్తింపు ఇవ్వాలని రాజకీయ వర్గాలు సూచిస్తున్నాయి. సింగరేణి మండలంలో పార్టీ పరిస్థితిని సమీక్షించి, క్షేత్రస్థాయి నాయకుల అభిప్రాయాలను తెలుసుకుని వారి సేవలకు తగిన గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందనే చర్చ కొనసాగుతోంది.

ఉపాధి హామీ పనులపై కూలీలతో వివరాలు సేకరణ

-125 రోజుల పని కల్పనపై ఆరా తీసిన డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ



ప్రజాపక్షం/అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామ పంచాయితీ పరిధి బిజి కొత్తూరులో పంచాయితీ రాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ పర్యటించారు. వీబీ జీ రామ్ జీ పథకం కింద ఉపాధి హామీ కూలీలకు కల్పిస్తున్న 125 రోజుల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులు చేస్తున్న కూలీలతో నేరుగా మాట్లాడి, పథకం అమలు తీరు, పని కల్పన, ఉపాధి అవకాశాలపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో పనుల నిర్వహణ, కూలీలకు ఎదురవుతున్న సమస్యలు, పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు అందుతున్న ఉపాధి అవకాశాలపై వివరాలు సేకరించారు. కూలీల అభిప్రాయాలను తెలుసుకుని, పథకం అమలు తీరుపై అధికారులతో చర్చించారు. ఈకార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి అనూష, ఎంపీడీవో ముత్యాలరావు, మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్య, ఉప సర్పంచ్ చలమల్ల శివకుమార్, వీబీ జీ రామ్ జీ ఏపీవో సీతారామయ్య, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ పంచాయితీ కార్యదర్శి ఎం సంధ్యారాణి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఘనంగా కోట మైసమ్మ జాతర

-అమ్మవారిని దర్శించుకున్న భక్తులు -గ్రామంలో ఆధ్యాత్మిక సందడి



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలం ఉసిరిపల్లి గ్రామంలో కొలువైన కోట మైసమ్మ అమ్మవారి జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిసింది. జాతర సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి నామ స్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో జాతర ప్రాంగణం సందడిగా మారింది. భక్తులు మొక్కులు చెల్లించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. గ్రామీణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ జాతరలో గ్రామస్తులు, యువకులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో ఐక్యత, సోదరభావాన్ని చాటి చెప్పిన జాతర విజయవంతంగా ముగియడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

27 నుంచి మూడు మండలాల జోనల్ క్రీడా పోటీలు

-కమలాపురం ఏహెచ్ఎస్‌లో బాలికలు, బాలురకు వేర్వేరు రోజుల్లో పోటీలు



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి, పాల్వంచ, బూర్గంపాడు మండలాల విద్యార్థులకు ఈనెల 27,28 తేదీల్లో జోనల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ములకలపల్లి మండలం కమలాపురంలోని ఏహెచ్ఎస్ పాఠశాలలో జరిగే ఈ పోటీలకు క్రీడాకారులు, సంబంధిత పాఠశాలల పీడీలు, పీఈటీలు ఉదయం 9గంటలకు హాజరుకావాలని మండల విద్యాశాఖ అధికారి గొర్రె సత్యనారాయణ తెలిపారు. ఈనెల 27న బాలికలకు, 28న బాలురకు పోటీలు నిర్వహిస్తారు. కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో అండర్ 14 జూనియర్స్, అండర్ 17 సీనియర్స్ విభాగాలుగా పోటీలు జరగనున్నాయి. క్రీడల నిర్వహణపై ములకలపల్లి మండల విద్యాశాఖ అధికారి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇందులో మూడు మండలాల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు సహకరించి పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

మణుగూరులో ఖేత్ బచావో అభియాన్



ప్రజాపక్షం/మణుగూరుః మణుగూరు మండలం చిన్నరావిగూడెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వి. రాహుల్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి డా. కొమరం లక్ష్మణరావు రైతులకు నేల ఆరోగ్యం, భూసార పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున, రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్నకు బదులుగా తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

ఘనంగా ఇమ్మాన్యుయేల్ మందిర ప్రతిష్ట



ప్రజాపక్షం/పాల్వంచ : పట్టణ పరిధి గొల్లగూడెంలో ఇమ్మాన్యుయేల్ మందిర ప్రతిష్ట పాస్టర్ డి. జాన్స సుందర్‌రావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్రజలు సుఖ శాంతులతో, శాంతిఇ సహనంతో ఉండాలని తమకున్న దానిలో ఇతరులకు సాయం చేయాలంటూ ప్రార్థనలు, గీతనలు ఆలపించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా మాట్లాడుతూ ప్రార్థనా మందిరాలు ప్రజల మధ్యన ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. ప్రతీ ఒక్కరు ఇతరుల పట్ల ప్రేమ, సహనంగా, గౌరవంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో 45వ, డివిజన్ కార్పోరేటర్ దంతెబోయిన నరేష్, బ్రదర్ జాన్‌పీటర్, రవి, గాబ్రియేల్, సత్యపాల్, సామ్యూల్, ప్రభుదాస్, జేమ్స్, తిమోతి, రమేష్, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు సాగు చేయని రైతులకు రైతు భరోసా అందించాలి



- తక్కువ వర్షపాతంతో రైతులకు నష్టం జరగకుండా చూడాలి
- సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఎల్‌నినో నేపథ్యంలో పంట సాగు చేయని రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంబైపాస్‌రోడ్డులోని సిపిఐ జిల్లా కార్యాలయంలో షేక్ షాహిన్ అధ్యక్షతన ఖమ్మంరూరల్ మండల సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ...తక్కువ వర్షపాతం నేపథ్యంలో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడం వల్ల పంటల సాగుకు ఆటంకాలు ఏర్పడే పరిస్థితుల్లో రైతు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన సహాయక చర్యలు తీసుకోవాలని సూచించారు. పంటల సాగు చేసిన రైతులకు వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టం వాటిల్లితే పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని, సాగుకు అనుకూల పరిస్థితులు లేక పంటలు వేయలేని రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతులకు అండగా నిలిచేలా రైతు భరోసా పథకం ద్వారా సాయం అందించాసలి పేర్కొన్నారు. మరోవైపు,ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశాలను ముందుగానే గుర్తించి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి సరఫరాపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, పగ్గేళ్ల వీరభద్రం, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, బూర నాగేశ్వర రావు, వెంపటి సురేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బూర మనోజ్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఖమ్మం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అడహాక్ కమిటీ సభ్యులు కొండబాల కరుణాకర్ తెలిపారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కొండబాల కరుణాకర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో పాలేరు చెరువులో, వైరా ప్రాజెక్టులో నీళ్లు ఉన్నా ప్రభుత్వ అసమర్థత వల్ల పంటలు ఎండిపోతున్నాయన్నారు. మంత్రులు ప్రకటనలకే పరిమితం అవుతున్నారన్నారు. జిల్లాలో విష జ్వరాలు ప్రభలి ప్రజలు చనిపోతున్నా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం రైతాంగానికి కన్నీరు మిగిల్చిందన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటి పంటలు చేతికందే దశలో నీళ్లు లేక ఎండిపోతున్నాయన్నారు. ప్రభుత్వం ఎండిపోయిన పంట పొలాలను, ఇతర పంటలను వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి ఎకరానికి రూ. 50వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలు నెలకొన్నాయన్నారు. రైతుల పంటలను కాపాడడంతో పాటు ఖమ్మంజిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరారు.ఈ సమావేశంలో నాయకులు మల్లెంపాటి అప్పారావు, నాగార్జున శ్రీనివాస్, వాసిరెడ్డి భాస్కర్‌రావు, పాలడుగు కృష్ణ ప్రసాద్, రాయల కోటేశ్వరరావు, చావా రామారావు, కామినేని శ్రీనివాస్, నల్ల మోతు సత్యనారాయణ, కర్నాటి అశ్వనికుమార్, నామా ఉపేందర్, దామాల శివ పాల్గొన్నారు.

టిబి రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ బాస్కెట్లు పంపిణీ



ప్రజాపక్షం/కల్లూరుః చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం టిబి రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ బాస్కెట్లు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ పెద్ది నేని శ్రీకాంత్ జోష్ణ మెటర్నరిటీ అండ్ పెర్టిలిటీ హాస్పిటల్ నెహ్రూ నగర్ యాజమాన్యానికి చెన్నూరు వైద్యాధికారి తబస్సుమ్ చేతుల మీదుగా పంపిణీ చేయగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలో దాతలు ముందుకు వచ్చి నిక్షయ్ మిత్రగా ముందుకు వచ్చి వ్యాధిగ్రస్తులకు అండగా నిలవాలని వైద్యులు పిలుపునిచ్చారు. టిబి రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు రాధాకృష్ణ, సురేష్, సూపర్వైజర్ సురేష్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు, మహిళా ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు ,ఆశా కార్యకర్తలు, టిబి బాధితులు తదితరులు పాల్గొన్నారు.

కెటిపిఎస్, కిన్నెరసానిని సందర్శించిన విద్యార్థులు





ప్రజాపక్షం/ రఘునాథపాలెం : మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని పిఎంశ్రీ జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు పారిశ్రామిక, పర్యావరణ విజ్ఞాన యాత్రలో భాగంగా పాల్వంచ కెటిపిఎస్, కిన్నెరసాని ప్రాంతాలను సందర్శించారు. శనివారం పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు కెటిపిఎస్‌లోని ఓ అండ్ పి విభాగాన్ని, కిన్నెరసాని డ్యామ్‌తో పాటు అక్కడి అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కెటిపిఎస్ సిబ్బంది విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను, అందులో ఉపయోగించే సాంకేతిక పరికరాలు, ఉత్పత్తి జరిగే విధానాన్ని విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పలు అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కిన్నెరసాని డ్యామ్‌తో పాటు పరిసర అటవీ ప్రాంతాన్ని విద్యార్థులు సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఆహ్లాదకర వాతావరణంలో సందడిగా గడిపారు. జలవనరుల ప్రాముఖ్యత, అటవీ సంపద విలువ, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ఈ యాత్రలో ప్రత్యక్షంగా విద్యార్థులు తెలుసుకున్నారు. పుస్తకాల్లో చదువుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించే అవకాశం లభించడంతో విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి క్షేత్ర సందర్శన విద్యార్థుల్లో శాస్త్రీయ ధృక్పథం, పర్యావరణ స్పృహ పెంపొందుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. యాత్రకు సహకరించిన కెటిపిఎస్ సిబ్బందికి, అటవీ శాఖ సిబ్బందికి విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ యాత్రలో ఉపాధ్యాయులు వై. శివకుమార్, టి. వీరాంజనేయులు, ఎ. నర్సయ్య, ఎన్. శాంతి, ఎస్. శ్రీనివాసరావు, ఎ. సైదయ్య, పి. పద్మావతి, రజిత, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

డిహెచ్‌పిఎస్ 20 వసంతాల వారోత్సవాలు



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు లోని మునిసిపాలిటీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ 20వ వసంతాల వేడుక సందర్భంగా డిహెచ్‌పిఎస్ పతాకాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి స్వతంత్రం వచ్చి 60 సంవత్సరాలు దాటిన కుల వ్యవస్థలలో మౌలిక మార్పులు రాలేదని, సామాజిక అణచివేతలు, కుల వివక్షత, అంటరానితనం, భూస్వామ్య దౌర్జన్యాలు, దేవాలయ ప్రవేశ నిరాకరణ, గ్రామీణ ప్రాంతాలలో రెండు గ్లాసుల పద్ధతి ఈనాటికి కొనసాగుతుందని, సమాజంలో కలిసిమెలిసి జీవించవలసిన ప్రజల మధ్య ఒకరినొకరు అనూహ్యంగా చూసుకుంటున్న దుస్థితి నేటికీ కొనసాగడం నాగరికత సమాజానికి సిగ్గుచేటు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు యామాల గోపాలరావు, జిల్లా సహాయ కార్యదర్శి వేము రాంబాబు, తడికమళ్ళ యోబు, సిపిఐ మండల నాయకులు కొత్తపల్లి వెంకటనారాయణ, దళితులు గొల్లమందల ఎలిశమ్మ, యశోద సామ్రాజ్యం, రాధమ్మ వరమ్మ , మరియమ్మ, ప్రకాష్ ,మణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు నిర్ధారణతోనే అసంక్రమిత వ్యాధులకు అడ్డుకట్ట



-బిపీ, మధుమేహం, క్యాన్సర్ తొలిదశలోనే గుర్తించాలి
-డిఎంహెచ్ఓ డాక్టర్ డి రామారావు

ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగంః అసంక్రమిత వ్యాధులను ముందస్తుగా గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయాన్ని నివారించి సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చన్ని ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు అన్నారు. బిపీ, మధుమేహం, వివిధ రకాల క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఖమ్మం నగరంలోని ఐడిఓసీ ప్రాంగణంలో ఉన్న ప్రజ్ఞ సమావేశ మందిరంలో శనివారం ఎన్‌సిడి(అసంక్రమిత వ్యాధులు) విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షన వహించారు. హైదరాబాద్ సిహెచ్ఎఫ్‌డబ్ల్యూ కార్యాలయానికి చెందిన రాష్ట్ర ఎన్‌సిడి నోడల్ అధికారి డాక్టర్ కరుణశ్రీ, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ శ్రవణ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ రామారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యాధుల లక్షణాలు తీవ్రరూపం దాల్చే వరకు వేచి చూడకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ కరుణశ్రీ, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ శ్రవణ్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎన్‌సిడీ స్క్రీనింగ్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పరీక్షల నిర్వహణ, రికార్డుల నమోదు, మందుల పంపిణీ, రోగుల నిరంతర పర్యవేక్షణ పక్కాగా చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ అరుణాదేవి, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆరోగ్యశాఖకు చెందిన వివిధ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

నల్లమల అక్షిత కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం ఃఃః

ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలి

- ప్రతి రోజు 20 మందికి కుష్ఠువ్యాధి సర్వే చేయాలి
- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి



ప్రజాపక్షం/పాల్వంచ : మల్టిపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ వారు పని చేసే గ్రామాలలో ప్రతీరోజు ఉదయమే కనీసం 20 గృహాలను సంధర్శించి కుటుంబంలోని ప్రతీ ఒక్కరికి మలేరియా, టిబి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వాటికి సంభందించిన ప్రతిపాదనలు డిఎంహెచ్ఓ కార్యాలయానికి పంపించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి తుకారా రాథోడ్ అన్నారు. పాల్వంచలోని డిప్యూటి డిఎంహెచ్ఓ కార్యాలయంలో మల్టిపర్పస్ హెల్త్ అసిస్టెట్స్‌తో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరం వచ్చిన ప్రతీ ఒక్కరికి తప్పని సరిగా ఆర్‌డిటి లేదా మైక్రోస్కోపీ ద్వారా మలేరియా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత నెలకు సంభంధించిన అన్ని రోగ నిరోధక టీకాల కార్యక్రమాలనువందశాతం పూర్తి చేయాలని సూచించారు. మీజిల్స్ రూబెల్లా టీకాలకు అప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలన్నారు.టీకాలు తీసుకోకుండా మిగిలిన పిల్లలను, మద్యలో నిలిపివేసిన పిల్లలను గుర్తించి వారికి టీకాలు అందించే విధంగా కృషి చేయాలని చెప్పారు. కుష్ఠువ్యాధి సర్వే, క్షయవ్యాధిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. టిబి అనుమానిత కేసులకు సీరమ్ సమూనా సేకరణ, ఎక్స్‌రే పరీక్షలు మరియు సిబిఎన్ఏఏటి పరీక్షల నిర్వాహణ తీరును సిబ్బందికి పూర్తి స్థాయిలో వివరించారు. ఎంపిహెచ్ ఏలు వారి పరిధిలోని గ్రామాలకు క్షేత్ర స్థాయిలో వెళ్ళే ముందు ఆరోగ్య కార్యక్రమాలపై సిబ్బంది పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని ప్రజలకు సమర్థవంతమైన ఆరోగ్య అవగాహన కల్పించాలని సూచించారు. భారత ప్రభుత్వం 2030 నాటికి టిబి వ్యాధిని నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకొందని దానికి అనుగుణంగా లక్ష్యం నెరవేర్చేందుకు ఆరోగ్య సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలలో ప్రజలకు క్షయవ్యాధిపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కుష్ఠువ్యాధి సర్వేకు సంభంధించిన సూచనలుసిబ్బంది అందరూ ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుండి 9 గంటల మద్య కనీసం 20 మందికి పరీక్షలు చేసి సర్వే నివేదికలను క్రమం తప్పకుండా డిఎంహెచ్ఓ కార్యాలయానికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటిసిఓ ప్రసాద్, డిప్యూటి డిఎంహెచ్ఓ శ్రీధర్, పిఓడిటి రాందాస్, ఏఎంఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారంలో తక్షణమే స్పందించాలి

- ఎస్పి రోహిత్ రాజ్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారంలో పోలీస్ అధికారులు తక్షణమే స్పందించాలని ఎస్పి రోహిత్‌రాజ్ అన్నారు. శనివారం సైబర్ వారియర్స్ సమావేశంలో భాగంగా పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ సైబర్ నేరాల బాధితులు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చినప్పుడు తక్షణమే స్పందించి మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని తెలిపారు. సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సైబర్ వారియర్స్ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ పెండింగ్ ఫిర్యాదులు కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పి సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సిఐ నరేష్, ఎస్సై జుబేదా బేగం, డిఫోర్సి సిబ్బంది సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల కమీషనర్ వైదొలగాలి

- విద్యారంగానికి 20 శాతం నిధులివ్వాలి
- సాదిక్ ఫౌండేషన్ ప్రతినిధి సాదిక్ అలీ



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : కేంద్ర ఎన్నికల ప్రధాన కమీషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవి నుండి వై దొలగాలని విద్యారంగానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు 20 శాతం నిధులను కేటాయించాలని సాదిక్ ఫౌండేషన్ ప్రతినిధి సాదిక్ అలీ డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా సాదిక్ ఫౌండేషన్ చేపట్టిన ప్రజాయాత్ర శనివారం భద్రాద్రి కొత్తగూడెం కేంద్రానికి చేరుకున్న సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఘన స్వాగతం పలికింది. అనంతరం సాదిక ఫౌండేషన్ , ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, విద్యారంగ సమస్యలపై విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సాదిక్ అలీ మాట్లాడుతూ దేశంలో ఓటుహక్కు పరిరక్షణ అత్యంత కీలకమని, ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లను తొలగించారన్న ఆరోపణలపై పారదర్శకంగా దర్యాప్తు జరపాలని స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించడంలో ఈసీ విఫలమైందన్నారు. విద్యకు పెద్దపీఠ వేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లో 20శాతం నిధులను కేటాయించాలని నిధుల సాధన కోసం పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కే షాదిక్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ దేశ ప్రజాస్వామ్య మనుగడ ఓటు హక్కు పరిరక్షణతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్న అవకతవకలపై ఎన్నికల సంఘం జవాబుదారీ తో వ్యవహరించాలన్నారు. జిల్లా కార్యదర్శి అజిత్ మాట్లాడుతూ ఢిల్లీ జరుగుతున్న నిరసనలకు సంఘీభావంగా రాష్ట్రంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి ఉందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌళిక వసతులు కల్పించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసి చైర్మన్ మల్లెల రామనాధం, తెలంగాణ జనసమితి నాయకులు దేవదాసం, నభి ఏఐఎస్ఎఫ్ విద్యార్థినాయకులు కళాబృందం సభ్యులు స్వామి శ్రీనివాస్ ఎల్లేష్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో కాంగ్రెస్ విఫలం

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి



ప్రజాపక్షం/భద్రాచలం : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్య ఉపాధి ఉద్యోగ రంగాల్లో విఫలమైందని బిఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం భద్రాచలం హరితా హోటల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజురీయింబర్స్మెంట్ ఉపకారవేతనాలు విడుదల కాక విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఫీజుల కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని జాబ్‌క్యాలెండర్ మెడా డిఎస్సి నిరుద్యోగ భృతి హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. రాజీవ్ యువవికాసం పథకంపై యువత ఆశలు నిరాశగా మారాయని పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యలపై బిఆర్ఎస్ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. అర్హులైన పట్టభద్రులంతా ఫారం 18 ద్వారా ఓటు నమోదును పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎల్సి ఎన్నికల భద్రాచలం నియోజకవర్గ ఇంచార్జ్ రావులపల్లి రామ్‌ప్రసాద్, మానె రామకృష్ణ కోటగిరి ప్రబోద్‌కుమార్ దొడ్డి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికీ ఆరోగ్య సూత్రాలు వివరించాలి

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేసే సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆరోగ్యసూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డా.తుకా రామ్ అన్నారు. శనివారం పాల్వంచ డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో మల్టీప ర్పస్ హెల్త్ అసిస్టెంట్లతో గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యాచరణ గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా పరీక్షలు జ్వరం వచ్చిన ప్రతీ వ్యక్తికి తప్పని సరిగా ఆర్‌డిటి లేదా మైక్రోస్కోపీ ద్వారా మలేరియా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత మాసానికి సంబంధించిన అన్నిరోగ నిరోధక టీకాల కార్యక్రమాలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. మీజిల్స్‌రూబెల్లా టీకాల కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని టీకాలు తీసుకోకుండా మిగిలిపోయిన పిల్లలు మధ్యలోటీకాలు అపివేసిన పిల్లలను గుర్తించి వారికి టీకాలు అందేలా చూడాలన్నారు. అక్టోబర్ 24 జరిగే ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది తమ విధులను సంక్రంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిటిసిఓ డా.ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీధర్ పిఓడిటి డా. రామ్‌దాస్ ఏఎంఓ రాందాస్ తదితరులున్నారు.

శ్రీరాగ స్కూల్లో ఐక్యరాజ్యసమితి దినోత్సవం



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : జిల్లా కేంద్రంలోని మేదర్‌బస్తీలో గల శ్రీ రాగా స్కూల్లో శనివారం ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వరప్రసాద్, డైరెక్టర్ కవిత తదితరులు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ఆవిర్భావం లక్ష్యాలు ప్రపంచ శాంతి స్థాపనలో దాని పాత్ర అంతర్జాతీయ సహకారం మానవహక్కుల పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక క్విజ్ ఉపన్యాస వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు మహాలక్ష్మి స్వాతి భారతి రమ్య నాగమణి చరిత శ్రీ వెంకటలక్ష్మి హసీనా అఖిల రామకృష్ణ ఆఫ్రిన్ రజిని ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కకాటు ఇంజెక్షన్ ఇవ్వటానికి నిరాకరించిన వైద్యులు

ప్రజాపక్షం/పాల్వంచ : మండల పరిధి లక్ష్మిదేవిపల్లి యు పంచాయితీ నరసింహసాగర్ గ్రామానికి చెందిన కాలం ఎర్రయ్య కొడుకైన తొమ్మిది సంవత్సరాల వయసు కలిగిన అజిత్‌ను ఈ నెల 17వ, తేదీన కుక్క కాటు వేసింది. వెంటనే దగ్గరలోని ఉల్వనూర్ గిరిజన ప్రాథమిక ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అప్పటికే ఆసుపత్రిని మూసివేసి ఉంది. దీనితో పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రాబిపూర్ వ్యాక్సిన్ ఇచ్చారు. అనంతరం 20వ, తేది రెండవ డోస్, 24న, మూడవ డోస్, నవంబర్ 14వ, తేదీన నాలుగవ డోస్ వ్యాక్సిన్‌లు ఇవ్వాలని నిర్దారించారు. శనివారం మూడవ డోస్ కోసం ఉల్వనూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళగా వైద్యులు పరీక్షించి ఒక్కరికే వ్యాక్సిన్ ఇవ్వటం వలన మొత్తం వ్యాక్సిన్ నిరుపయోగం అవుతుందన్నారు. కావునా రెండు రోజుల అనంతరం తిరిగి సోమవారం రావాలని సూచించారు. ఎంత బతిమిలాడినా వ్యాక్సిన్ ఇవ్వటానికి వైద్యులు దేవేందర్ నిరాకరించటంతో చేసేదేమి లేకపోవటంతో 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళగా సమయం మించిపోయిందని సోమవారం రావాలని సిబ్బంది చెప్పినట్లు బాదితుడి తండ్రి ఎర్రయ్య చెప్పారు. ఈవిషయంపై ఉల్వనూర్ వైద్యులు దేవేందర్‌ను వివరణ కోరగా మూడవ డోస్ రెండు, మూడు రోజులు అలస్యమైనా ఇబ్బంది ఉండదని చెప్పారు.

కమల్‌రాజు జన్మదినం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు



ప్రజాపక్షం/మధిర: బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఖమ్మం జిల్లా జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మధిర పట్టణంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించాలనే ఉద్దేశ్యంతో అన్నదానం, పేదలకు సహాయం, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. సమాజంలో సేవాభావం, మానవత్వం, ఐక్యతను పెంపొందించడంతో పాటు అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కమల్‌రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ప్రజా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ప్రజాసేవే లక్ష్యంగా, సమాజ సంక్షేమమే ధ్యేయంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డుపై బైక్‌తో స్టంట్లు.. డిగ్రీ విద్యార్థిపై కేసు నమోదు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో బైక్‌స్టంట్లు చేస్తున్న వెంకటగిరికి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థి ఐతగాని అజయ్‌కుమార్(20)పై ఖమ్మం రూరల్ శనివారం కేసు నమోదు చేశారు. పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి, చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ ముష్క రాజు మాట్లాడుతూ..సరదా కోసం తన ప్రాణాన్ని పనంగా పెట్టడంతో పాటు ఇతరుల ప్రాణాలతో చెలగాటం ఆడేవారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని ఇలా బైక్ స్టంట్లకు పాల్పడే ఆకతాయిలను గుర్తించి చర్యలు తీసుకుంటుందన్నారు. రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని సూచించారు.

మధిర నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/చింతకాని : మధిర నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. చింతకాని మండలంలో ప్రజలకు అవసరమైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వ్యవసాయ రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ప్రొద్దుటూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న 33కేవి సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు.తిమ్మినేనిపాలెం నుండి మత్తేపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు తిమ్మినేనిపాలెం గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. గాంధీనగర్ గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు తాగునీటి సరఫరా పనులకు రామకృష్ణాపురం గ్రామంలో రామకృష్ణాపురం నుండి పెద్దగోపతి వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. కొదుమూరు గ్రామంలో వెంకటాయపాలెం నుండి కొదుమూరు వరకు నాలుగులైన్ల రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కొదుమూరు గ్రామ ప్రజలు రోడ్డు విస్తరణతో తమ ఇండ్లు కోల్పోతున్నామని, రోడ్డు విస్తరణ తగ్గించాలని వినతి పత్రం అందజేశారు. మండలంలో 3800 కుటుంబాలకు ఉచిత కరెంటు అందడం లేదని, కులాంతర వివాహాలు చేసుకున్న 15 మంది కి దళితబందు మంజూరై గ్రౌండింగ్ కాలేదని వారికి తక్షణమే గ్రౌండింగ్ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు భట్టీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎన్పీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరక్టర్ మోహన్‌రావు, సిఈ సురేందర్, ఎస్ఈ శ్రీనివాసాచారి, డీఈలు మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ , పలు శాఖల అధికారులు, పలుపురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.


క్షణం నిర్లక్ష్యం.. జీవితాంతం గాయం!



ట్రామా బాధితులకు సకాలంలో చికిత్సే ప్రాణరక్ష

సకాలంలో వైద్యమే కీలకం

ప్రముఖ వైద్యులు గొంగూర వెంకటేశ్వర్లు, ఖమ్మం.
రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్, శ్రీరక్ష హాస్పటల్ అధినేత



ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: ప్రమాదం ఏ రూపంలో నైనా రావచ్చు..రోడ్డు ప్రమాదాలు.. ఎత్తు నుంచి పడిపోవడం, కాలిన గాయాలు, పని ప్రదేశాలలో జరిగే దుర్ఘటనలు క్షణాల్లో జీవితాలను మార్చేస్తాయి. ప్రమాదం జరిగిన తర్వాత బాధితుడికి అందించే తొలి వైద్య సహాయం, చికిత్స ప్రారంభించే వేగం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. ట్రామా ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, బాధితులకు సకాలంలో వైద్యం అందేలా చూడడం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

-తొలి నిమిషాలే కీలకం

ట్రామా అంటే ప్రమాదాలు లేదా ఇతర ఘటనల కారణంగా శరీరానికి కలిగే తీవ్రమైన గాయాలు, తలకు దెబ్బ తగలడం, అధిక రక్తస్రావం, ఎముకలు విరగడం, ఛాతీ, పొత్తికడుపు భాగాల్లో అంతర్గత గాయాలు కావడం వంటివి ప్రాణపాయానికి దారితీయవచ్చు. బయటకు చిన్నగాయంలా కనిపించినా లోపల తీవ్రమైన నష్టం జరిగి ఉండవచ్చు. అందువల్ల ప్రమాదానికి గురైన వ్యక్తి పరిస్థితిని తేలికగా తీసుకోకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించాలి. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, బాధితుడిని త్వరగా ఆసుపత్రికి తరలించాలి.

-అప్రమత్తతతో ప్రాణరక్షణ

ప్రమాదం జరిగిన ప్రదేశంలో ముందుగా పరిసరాలు సురక్షితంగా ఉన్నాయో లేదో పరిశీలించాలి. బాధితుడికి అధిక రక్తస్రావం ఉంటే శుభ్రమైన గుడ్డతో గాయంపై ఒత్తిడి ఇవ్వాలి. తల, మెడ, వెన్నెముకకు గాయమై ఉండవచ్చని అనుమానం ఉంటే వైద్య సిబ్బంది సూచన లేకుండా బాధితుడిని కదిలించకూడదు. స్పృహలో లేని వ్యక్తికి నీరు, ఆహారం లేదా మందులు నోటి ద్వారా ఇవ్వకూడదు. బాధితుడు సాధారణంగా శ్వాస తీసుకోకపోతే అత్యవసర సహాయం కోరుతూ శిక్షణ పొందిన వారు సిపిఆర్ అందించాలి.

-రహదారి భద్రతతో ప్రమాదాలకు అడ్డుకట్ట

హెల్మెట్ ధరించిడం, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, అతివేగాన్ని నియంత్రించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు రోడ్డు ప్రమాదాలను నివారించడం కూడా అవసరం. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం ఎంత ముఖ్యమో అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అంతకంటే ముఖ్యమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వైరా-బోనకల్ రహదారిపై గుంతలకు మరమ్మతులు చేపట్టాలి



ప్రజాపక్షం/వైరా: వైరా బోనకల్ అంతరాష్ట్ర రహదారుల గుంతలమయంతో ఆధ్వానంగా ప్రమాదాలకు నిలయంగా ఉంది. రోడ్డును గుంతలు పూడ్చే నాధుడు లేక వాహనదారులు గుంతలు తప్పించబోయిన కిందపడి కాళ్లు చేతులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. శనివారం గోపాలరావు మాట్లాడుతూ గుంతల వలన తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు కూడా కోల్పోతున్నారని కాళ్లు చేతులు విరిగిపోతున్నాయని ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అధికారులు నిర్లక్ష్య ధోరణి రోడ్ల మరమ్మత్తులపై దృష్టి సాధించాలి. అంతరాష్ట్ర రహదారి కావడంతో వాహనాల రద్దీ విపరీతంగా ఉంది. రాత్రిపూట గుంతలు కనపడక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. నిత్యం ఈ రోడ్డుపై ప్రజాప్రతినిధులు అధికారులు మంత్రులు ఎమ్మెల్యేలు కూడా వెళుతూ ఉన్నారని వారు కూడా గుంతల పట్ల స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. రోడ్ల మరమ్మత్తులపై నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా రోడ్లు ఉంటే ఆ రోడ్లకు మరమ్మత్తులు చేయరా ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు మేలొక్కని వైరా బోనకల్ అంతరాష్ట్ర రహదారిని మరమ్మత్తులు చేపట్టాలని యామాల గోపాలరావు అన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు, యువజన సంఘ సభ్యులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఖమ్మంనగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నూతనంగా నియమితులైనవారు దయాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారందరిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని స్వర్ణకుమార్, అజ్మీరా అశోక్‌నాయక్, బానోత్ కిషోర్‌నాయక్, కౌన్సిలర్లు బుర్ర మహేష్, కడవ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/పెనుబల్లి: మండల పరిధిలోని వివిఎం బంజరు పంచాయతీలోని పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో రోడ్డు ప్రమాదం జరిగింది. మండల పరిధిలోని గ్రామానికి చెందిన కోమటి రామకృష్ణ అశ్వారావుపేట ఏరియాలో పామాయిల్ కంపెనీలో పనిచేస్తూ ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణం గాక ఇంటికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండగా ఖమ్మం నుండి సత్తుపల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. పెనుబల్లి ఏరియా వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఖమ్మం తరలించారు.

తల్లాడలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004 2005 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడలో చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ ఒకచోట కలుసుకుని తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ 21 ఏళ్ల తర్వాత కలుసుకుని తమ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా డిజెలు

-కేసు నమోదు చేసిన ఎస్ఐ





ప్రజాపక్షం/ తల్లాడ : ముద్దునూరు గ్రామంలోని రామాలయం గుడి సెంటర్‌లో బతుకమ్మ ఊరేగింపు సందర్భంగా రెండు వాహనాల్లో డిజె సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి అధిక శబ్దంతో పాటలు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందడంతో డిజె నిర్వాహకులు, వాహన డ్రైవర్లు, డిజె ఆపరేటర్లు, ఎలక్ట్రికల్ ఆపరేటర్లు, నిర్వాహకులపై తల్లాడ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. డిజెతో పాటు వాటిని అమర్చిన వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేవిధంగా అధిక శబ్దంతో డిజెలు ఏర్పాటు చేయడం, ప్రమాదకరంగా వాహనాలు నడపటం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తల్లాడ పోలీసులు తెలిపారు.

విద్యార్థినిని అభినందించిన ఎంపిడివో



ప్రజాపక్షం/ తల్లాడ : అండర్ 14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న ప్యూచర్ జెన్ పాఠశాల విద్యార్థి సుమిత్‌జాట్ రజిత పతకం సాధించినందుకు తల్లాడ ఎంపిడివో శ్రీధర్ రాజు అభినందించారు. ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా ప్యూచర్ జెన్ పాఠశాలను సందర్శించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ శాంతి సామరస్యాన్ని కాపాడుతూ దేశభక్తిని గౌరవిస్తూ హక్కుల పట్ల అవగాహనతో ఉంటూ ఇతరుల పట్ల సహకార స్వభావాన్ని కలిగి ఉండాలని కోరారు. విద్యార్థులు ఒకరికొకరు ఐకమత్యంగా, ప్రజాస్వామ్యయుతంగా జీవిస్తే దేశంలో అశాంతి పరిస్థితులకు తావుండదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వి. సబిత, డైరెక్టర్ ఎండి తౌసిఫ్, కో ఆర్డినేటర్ ఎ. మధు, ప్రిన్సిపాల్ పివి లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ముమ్మరంగా ఓటు నమోదు కార్యక్రమం



ప్రజాపక్షం/ తల్లాడ : ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గం నుండి ఎంఎల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి, తల్లాడ మండల ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్ లు పిలుపునిచ్చారు. సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ఆదేశాలతో శనివారం తల్లాడ మండలంలోని ఎంఎల్సీ ఓట్ల నమోదు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కుర్నవల్లి కేంద్ర పరిధిలో ఉన్న గ్రామాల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. పట్టభద్రుల ఓట్లను చేర్పించారు. ఈ కార్యక్రమంలో కుర్నవల్లి, బస్వాపురం, కలకొడిమ, కేశావాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

సహకార సమరం

-కాంగ్రెస్‌లో అంతర్గత లొల్లి
-ఛైర్మన్లు, డైరెక్టర్ల పదవుల కోసం పోటాపోటీ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పిఏసిఎస్) పాలక వర్గాల నియామక ప్రక్రియ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత లొల్లి మొదలైంది. పాత, కొత్తతరం నాయకుల మధ్య ఛైర్మన్ పదవుల కోసం పోటీ నెలకొంది. ప్రభుత్వం సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినెటెడ్ పద్ధతిన పర్సన్ ఇన్ చార్జ్ (పిఐసి) కమిటీలను నియమించాలని నిర్ణయించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో ఆధిపత్య పోరు సాగుతుంది. గ్రామీణ ఆర్థిక రాజకీయ ముఖ చిత్రంలో అత్యంత కీలకమైన సొసైటీ ఛైర్మన్, డైరెక్టర్ల పదవులను దక్కించుకునేందుకు నాయకులు ఎవరికి వారు పోటా పోటీ లాబింగ్ చేస్తున్నారు. సొసైటీలో బాధ్యతలు చేపట్టేందుకు మండల స్థాయి నుంచి నియోజక వర్గ స్థాయి వరకు అధిక సంఖ్యలో ఆశావాహులు తమ ప్రయత్నాలు చేపట్టారు. ఛైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ల పోస్టుల కోసం నేతలు స్థానిక ఎంఎల్ఏ, మంత్రి క్యాంపు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సామాజిక వర్గ బలం, పార్టీకి అందించిన సేవలను గుర్తు చేస్తూ పైరవీలను ముమ్మరం చేశారు. పలుచోట్ల సొసైటీ ఛైర్మన్ పదవి కోసం నలుగురైదుగురు పోటీ పడుతుండడంతో ఎవరి పేరు ఖరారు చేయాలో ప్రజాప్రతినిధులకు కూడా అర్థం కానీ పరిస్థితి నెలకొంది. సొసైటీ పదవులకు సంబంధించి కాంగ్రెస్‌లో కొత్తా, పాత తరం అంటూ విబేధాలు నెలకొంటున్నాయి.

గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులను ఎదుర్కొని సొంత జేబుల నుంచి ఖర్చు చేసి పార్టీని నిలబెట్టిన పాత కాంగ్రెస్ నేతలు తమకే తొలి ప్రాధాన్యతనివ్వాలని పట్టుబడుతున్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారిని గుర్తించాలని కోరుతున్నారు. ఎన్నికల ముందు ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చిన కొత్త నేతలు కూడా తమకే పదవులు కట్టబెట్టాలని కోరడంతో పదవుల నియామకం మరింత ఇబ్బందికరంగా మారింది. ఖమ్మం నియోజక వర్గ పరిధిలో వి. వెంకటాయపాలెం, మంచుకొండ, రఘునాథపాలెం సొసైటీలతో పాటు ఆంధ్రాబ్యాంకు సహకార సంఘం ఉంది. ఈ నాలుగు సొసైటీలను విభజించేందుకు ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి పంపించారు. వి. వెంకటాయపాలెం సొసైటీ పరిధిలో మరో రెండు వేపకుంట్ల, అల్లిపురం, మంచుకొండ సొసైటీ పరిధిలో మరొకటి ఈర్ల పుడి సొసైటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అదేవిధంగా సొసైటీని విభజించి నూతనంగా గువ్వలగూడెం, మద్దులపల్లి సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ విభజన పూర్తయితే ఖమ్మం నియోజక వర్గ పరిధిలో మొత్తం ఏడు సొసైటీలు అందుబాటులోకి రానున్నాయి. వాటికి పాలక వర్గాలను నామినెటెడ్ పద్ధతిలో నియమించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి. ప్రతి సొసైటీ నుంచి నాలుగు రైదుగురు అభ్యర్థులు ఛైర్మన్ పదవి కోసం పోటీపడుతుండడంతో వారిని బుజ్జగించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. మరో వారం రోజుల్లో సొసైటీలకు పాలక వర్గాల నియామక ఉత్తర్వులు రానున్నట్లు సమాచారం. దీనితో ఆశావాహులు ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆశావాహులను బుజ్జగిస్తూ ఇతరత్రా నామినెటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామంటూ హామీ ఇస్తున్నట్లు సమాచారం.

ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ

-సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం నల్గొండ వరంగల్ నియోజక వర్గ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిపిఎం సిద్ధంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో తమతో కలిసి వచ్చే శక్తులతో కలిసి బరిలోకి దిగుతామన్నారు. ఈ సందర్భంగా సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలతో పాటు రాజకీయ అంశాలను సైతం ప్రచారం చేస్తామని నాగేశ్వరరావు తెలిపారు. యువ జనులకు అవసరమైన ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వాలు ఉపాధి కల్పించడం లేదని ఈ విషయంలో ఘోరంగా విఫలమవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగమే తిరుగులేని సాక్ష్యమని సామాజిక, ఆర్థిక సంక్షోభం నుండి యువత ఉద్యమం వైపు పయనిస్తుందని ఆయన తెలిపారు. యువజనులు, పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రచార అస్త్రాలుగా వాడతామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎం. సుబ్బారావు, మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, బండారు రమేష్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి



ప్రజాపక్షం/మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేయడంతో పాటు, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ కె.సామ్యూల్‌పాల్ అధికారులను ఆదేశించారు. మధిర మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్ ఈ.ఉదయ్‌కుమార్, వార్డు ఆఫీసర్లతో పాటు కమీషనర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పన్నుల వసూళ్లు, ట్రేడ్ లైసెన్సులు, పట్టణ పారిశుద్ధ్య, నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారు మార్చి నెల వరకు సమయం ఉందని భావించి చెల్లింపుల్లో జాప్యం చేయరాదని కమీషనర్ స్పష్టం చేశారు. బకాయిదారులను గుర్తించి, వారు వెంటనే పన్నులు చెల్లించేలా వార్డు ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా నీటి

-వాణిజ్య సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలి
-మున్సిపల్ కమీషనర్ కె.సామ్యూల్‌పాల్

పన్ను బకాయిలను కూడా గుర్తించి, వాటి వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు.ఆస్తి పన్ను, నీటి పన్ను చెల్లించని బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని, నోటీసులకు స్పందించకుండా బకాయిలు చెల్లించని వారిపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమీషనర్ కోరారు. మున్సిపాలిటీ పరిధజలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న వాణిజ్య సంస్థలు నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్సులు పొందడంతో పాటు, సంబంధిత లైసెన్స్ ఫీజులను సకాలంలో చెల్లించాలని కమీషనర్ సూచించారు. లైసెన్సులు లేని వ్యాపార సంస్థలను గుర్తించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య భవనాలకు సంబంధించిన ఆస్తి పన్ను, నీటి పన్ను బకాయిలను కూడా సమీక్షించి, వాటి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కమీషనర్ సూచించారు. శానిటేషన్ బాధ్యతలు నిర్వహించే వార్డు ఆఫీసర్లు ప్రతిరోజు ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించి, పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పట్టణంలో ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా నిరంతరం చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ఈ.ఉదయ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- సిపి సునీల్‌దత్



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తే ప్రాణదానంతో సమానమని పోలీసు కమిషన్ సునీల్‌దత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక పెరెడ్ గ్రౌండ్‌లో సిపి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశరక్షణ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మయణీయమన్నారు. వారి త్యాగాలు స్మరించుకుంటూ సేవకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అత్యవసర సమయంలో రక్తం అందక ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తం దానంచేసేందుకు ముందుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పోలీస్‌శాఖ ముందుంటుందన్నారు. ఈ శిబిరంలో 150 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి మానవతా దృక్పదాన్ని చాటుకున్నారని వారిని ఈసందర్భంగా సిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భోజా రామానుజం, ఏఆర్ డిసిపి కుమారస్వామి, టౌన్ ఏసీపీ ఎస్ వెంకటరమణమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఏఆర్ ఏసీపీలు సునీల్‌సింగ్, నర్సయ్య, డాక్టర్ కార్తిక్, రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్లు కామరాజు, శ్రీశైలం, సురేష్, అప్పలనాయుడు, సీఐలు షాదీక్ పాషా, రామకృష్ణ, చిట్టిబాబు, నాగరాజు, కరుణాకర్, శివప్రసాద్ పాల్గొన్నారు.

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించండి

-సిపిఐ నేత సలాం



ప్రజాపక్షం/ ఖమ్మం : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. అసలే కరువు కాలంలో ఉపాధి లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలను బతకనివ్వని స్థితికి నెట్టివేస్తున్నాయన్నారు. ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అంటున్నారే తప్ప ఇంత వరకు ఎటువంటి పనులు చేపట్టలేదన్నారు. ఎల్‌నినో ప్రభావం గడిచిన రెండు నెలలుగా కనిపిస్తున్నా ఇంత వరకు చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని సలాం తెలిపారు. ప్రభుత్వం కరువు పాట పాడుతుంటే వ్యాపారులు నిత్యావసరాలను బ్లాక్ మార్కెట్లకు తరలించి ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. తక్షణం రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులను అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. బియ్యం ధర కేవలం బ్లాక్ మార్కెట్ కారణంగానే పెరుగుతుందని దీనిని నివారించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఈ సందర్భంగా త్రీటౌన్‌లో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోలో సిపిఐ నాయకులు భూక్యా రవీందర్, చిర్రా వెంకన్న, లింగయ్య, సురేష్, నక్కా లింగయ్య, జనార్థన్, కృష్ణ, సాయి, దుర్గారావు పాల్గొన్నారు.

ఉచితంగా బిపి, షుగర్, కంటి పరీక్షలు



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం పుణ్యపురం గ్రామంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ యంగల మరియమ్మ ఆధ్వర్యంలో గ్రేస్ జనరల్ హాస్పిల్, తనికెళ్ల వారి సహకారంతో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రేస్ జనరల్ హాస్పిటల్ నుంచి వచ్చిన వైద్య బృందం ప్రజలకు ఉచితంగా రక్తపోటు(బిపి), మధుమేహం(షుగర్) పరీక్షలు నిర్వహించింది. అదేవిధంగా కంటి పరీక్షలు చేపట్టి వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలోనే వైద్య పరీక్షలు, మందులు అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన సర్పంచ్ యంగల మరియమ్మను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రేస్ జనరల్ హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

23వేల మంది ఆదివాసీలకు వైద్యం కరువు

-కొమరారం పీహెచ్‌సీలో ఖాళీల భర్తీకి న్యూడెమోక్రసీ, పీవైఎల్ రాస్తారోకో

ప్రజాపక్షం/ఇల్లందు: కొమరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న వైద్యులు, ఇద్దరు నర్సులు, ఏఎన్ఎం, ప్రయోగశాల సహాయకుడు, సాంకేతిక నిపుణుడు, ఫార్మసిస్ట్, సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్)నాయకులు డిమాండ్ చేశారు. 23వేల మంది జనాభాకు ఒకే ఒక్క వైద్యుడు ఉండటంతో పేద ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మందుల కొరత, రక్త పరీక్షల నివేదికల్లో జాప్యంతో రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదని విమర్శిస్తూ కొమరారం ప్రధాన రహదారిపై రాస్తారోకో, ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. న్యూడెమోక్రసీ మండల నాయకుడు మోకాళ్ల కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇల్లందు మండల మాజీ ఎంపీపీ, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి యదళ్లపల్లి సత్యం, డివిజన్ నాయకుడు పొడుగు నరసింహారావు, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు మోతిలాల్ మాట్లాడుతూ వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించి, మందుల కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ఇల్లందు మండల కార్యదర్శి మూడు మాలు, మర్రిగూడెం సర్పంచ్ ముక్తి రమేష్, బోయితండా మాజీ సర్పంచ్ బానోత్ సంతు, పోచారం మాజీ సర్పంచ్ శ్రీను, ఉప సర్పంచ్ కోడి పాపారావు, న్యూడెమోక్రసీ పోచారం కార్యదర్శి తుడుం శ్రీను, పీవైఎల్ జిల్లా నాయకుడు జోగా కృష్ణ, మండల నాయకులు జర్పుల లక్ష్మణ్, కుంజా పాపయ్య, కుంజా నర్సయ్య, భూక్యా లచ్చు, కుంజా కృష్ణ, జర్పుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.